సాక్షి
అనంతపురం
ఆదివారం । 14 । జనవరి । 2024



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.16 కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ధర పలికాయి.



రేపు స్పందన ఉండదు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15వ తేదీన (సోమవారం) ప్రభుత్వం సెలవు ప్రకటించినందున ఆ రోజు కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన' రద్దు చేశారు.

గరిష్టం/కనిష్టం
33.4°/15.7°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

లేబర్ పేరుతో కుచ్చుటోపీ

- ఇళ్ల నిర్మాణాలకు లేబర్ పంపుతామన్న 'లోటస్' కంపెనీ
- డబ్బు తీసుకుని లేబర్‌ను పంపని వైనం
- ఫిర్యాదు చేసిన కాంట్రాక్ట్ సంస్థ
- కార్మికులను ఎమ్మెల్యే కిడ్నాప్ చేశారంటూ ఎల్లో మీడియా విషప్రచారం



పశ్చిమ బెంగాల్ కార్మికులతో వివరాలు ఆరా తీస్తున్న అనంతపురం రూరల్ తహసీల్దార్ విజయలక్ష్మీ

రాప్తాడు రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన లేబర్ (కార్మికులు)ను పంపుతామని చెప్పి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ సంస్థ కుచ్చుటోపీ పెట్టింది. ఈ సంస్థపై చర్యలు తీసుకుని ఒప్పందం ప్రకారం చెల్లించిన సొమ్ముకు కార్మికులను పంపేలా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అడిగితే ఎల్లో మీడియా దాన్ని వక్రీకరించింది. ఎమ్మెల్యేనే కమీషన్ కోసం కార్మికులను నిర్బంధించారంటూ విషప్రచారం చేసింది. దీనికితోడు టీడీపీ మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వత్తాసు పలకడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అసలేం జరిగిందంటే...

శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన వీరారెడ్డి అనే వ్యక్తి శాన్వి ఎంటర్ ప్రైజస్ కంపెనీ నడుపుతున్నారు. ప్రభుత్వం ద్వారా కాంట్రాక్ట్ తీసుకొని జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తుంటారు. 2023 జూలైలో రాప్తాడు పండమేటి వేంకటరమణస్వామి గుడి పక్కన జగనన్న కాలనీలో 123 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్‌ను 'శాన్వి' సంస్థ తీసుకుంది. అలాగే అనంతపురం రూరల్ మండలంలోని వివిధ లేఅవుట్లలో మరో 2 వేల ఇళ్ల నిర్మాణ పనులు ఈ సంస్థకే వచ్చాయి. ఈ క్రమంలో వీరారెడ్డికి పశ్చిమ బెంగాల్‌కు చెందిన లోటస్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీకి చెందిన సర్వర్ జహాన్, అతని తండ్రి అజీజుల్ హక్‌ను సుజయ్ బిశ్వాస్ అనే వ్యక్తి పరిచయం చేశాడు. జహాన్‌కు 2023 ఆగస్టులో ఇళ్ల నిర్మాణ లేబర్ కాంట్రాక్ట్ ఇచ్చారు. 500 మంది లేబర్స్‌కు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అడ్వాన్స్, ఒక్కొక్కరికీ ప్రయాణం ఖర్చులకు రూ.వెయ్యి, జహాన్ ఖర్చులకు గాను రూ.79 వేలు కలిపి మొత్తం రూ.55 లక్షల 79 వేలు విడతల వారీగా 'లోటస్' అకౌంట్ : 047205012994 ఐసీఐసీఐ, మల్డా బ్రాంచ్‌కు 'శాన్వి' బ్యాంకు ఖాతా నుంచి జమ చేశారు. అయితే జహాన్ అవసరమైన లేబర్‌ను పిలుచుకు రాలేదు. పైగా అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది.

తర్వాత ఏమైందంటే..

అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీలోనూ సర్వర్ జహాన్ సమకూర్చిన కార్మికులు ఉన్నారనే ఉద్దేశంతో 'శాన్వి' సంస్థ ప్రతినిధులు ఇటీవల అక్కడికి వెళ్లి విచారించారు. వంద మంది లేబర్లలో 91 మందికి సర్వర్ జహాన్ కూలి డబ్బులు సరిగా ఇవ్వనందున వెళ్లిపోయారనే విషయం విచారణలో అక్కడున్న తొమ్మిది కూలీల ద్వారా తెలిసింది. వారిద్వారానే జహాన్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. శాన్వి సంస్థ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి.. డబ్బు తీసుకుని లేబర్‌ను పంపకుండా ఇళ్ల నిర్మాణం జాప్యం జరగడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారం

కొడిమి జగనన్నకాలనీలో ఉన్న తొమ్మిది మంది కార్మికులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అండతో రూరల్ పోలీసులు నిర్బంధించారంటూ ఎల్లో మీడియా ప్రచారం చేసింది. ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ఎంపీ జిల్లా ఎస్పీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ అన్బురాజన్ వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు రాధారమాదేవి, సుజాత శనివారం ఉదయం కొడిమి జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడున్న తొమ్మిది మంది కార్మికులను సుదీర్ఘంగా విచారించారు. తమను ఎవరూ నిర్బంధించలేదని, తమను ఇక్కడికి తీసుకొచ్చిన కాంట్రాక్టర్ సర్వర్ జహాన్ మోసగించాడని వాపోయారు. రెండు నెలలుగా కూలి డబ్బు ఇవ్వకుండా పత్తా లేకుండా పోయాడని పేర్కొన్నారు. అంతే తప్ప ఇక్కడున్న ఎవరూ తమను ఇబ్బంది పెట్టలేదని స్పష్టం చేశారు.

రూరల్ పోలీసులకు శాన్వి సంస్థ ఫిర్యాదు

ఇళ్ల నిర్మాణానికి లేబర్‌ను పంపుతామని తమను మోసం చేసిన సర్వర్ జహాన్, అతని తండ్రి అజీజుల్ హక్ ఇద్దరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రూరల్ పోలీసులకు శాన్వి సంస్థ ప్రతినిధి వీరారెడ్డి శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన కూడా ఈ విషయంపై సీరియస్ అయ్యారు. లేబర్ పంపుతామని మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- ఇదిలా ఉండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులను రూరల్ తహసీల్దార్ విజయలక్ష్మి తన కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు



కొడిమి జగనన్న కాలనీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొందరు కార్మికులను నిర్బంధించారంటూ ఎస్పీ అన్బురాజన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వెళ్లగా తొమ్మిది మంది కార్మికులు జగనన్న కాలనీలో పని చేసుకుంటూ కనిపించారు. సర్వర్ జహాన్ అనే వ్యక్తి ఒక మేస్త్రీ ద్వారా వీరందరినీ ఇక్కడ పనిలో కుదిర్చాడు. కొంతకాలంగా వీరికి కూలి డబ్బులు చెల్లించలేదు. దాదాపు రూ.5 లక్షల దాకా బకాయి పడ్డాడు. మమ్మల్ని ఎవరూ నిర్బంధించలేదని చెప్పారు. కిడ్నాప్ చేశారంటూ అసత్య ప్రచారం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– వెంకట శివారెడ్డి, డీఎస్పీ, అనంతపురం రూరల్



అనంతపురంలో రంగుల కొనుగోళ్లు



గుంతకల్లులో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీల్లో ఆకట్టుకున్న అయోధ్య రామ మందిరం ముగ్గు

సరదాల సంక్రాంతి సందడి



అనంతపురంలో భోగిమంటల వద్ద సందడి

అనంతపురం కల్చరల్: మూడు రోజుల పండుగ సంక్రాంతి సందడి మొదలైంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జిల్లా అంతటా ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో కళకళలాడుతోంది. భూమి తల్లికి అలంకారం చేసే గొబ్బెమ్మలతోటి ముత్యాల ముగ్గులు, యజమాని బాగుంటే చాలనుకునే బసవన్నల హడావిడి అప్పుడే ప్రారంభమైంది. పాల పొంగులు, పాత బాధలు మరిచిపోయి కొత్త ఆనందాలను వెతుక్కోవాలనే సూచనను అంతర్లీనంగా సూచించే భోగి మంటల్లో పాత వస్తువులను పడేసే పర్వదినం రాకతో సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తున్న ప్రతి లోగిలిలో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. చిన్నారులను ఆశీర్వదిస్తూ భోగి పండ్లను పోసే పండుగ కోసం చిన్నారుల తల్లులు ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. ఆదివారం నుంచి మూడురోజుల పాటు సాగే భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.

సంక్రాంతి శుభాకాంక్షలు



గౌతమి, కలెక్టర్ అన్బురాజన్, ఎస్పీ

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. భోగి పంటను సంతోషంగా జరుపుకోవాలన్నారు. పాడిపంటలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని, సిరి సంపదలు తులతూగాలని ఆకాంక్షించారు.

రేపు కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లు: ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపికకు సంబంధించి ఆదివారం గుంతకల్లులోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీబీ మంజునాథ్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 20 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9441053041, 996622466 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కరువు మండలాల్లో రుణాల రీషెడ్యూల్

అనంతపురం అగ్రికల్చర్: కరువు మండలాల్లో సహాయక చర్యల కింద రైతులకు పంట రుణాల రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ (ఎల్‌డీఎం) సత్యరాజా తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన రైతులు పంట రుణాలు తీసుకున్న బ్యాంకుల్లో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. 2023 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నిబంధనల మేరకు బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు మినహా మిగతా 28 మండలాలను కరువు జాబితాలో ప్రకటించిందని గుర్తు చేశారు. సహాయక చర్యల్లో భాగంగా 2023 ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలను ఆసక్తి కలిగిన రైతులు రీషెడ్యూల్ చేసుకోవచ్చన్నారు. మూడు లేదా ఐదేళ్లలో టర్మ్‌లోన్ల మాదిరిగా వడ్డీతో పాటు చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సాధారణంగా రుణాలు ఏడాదిలోపు అంటే వడ్డీతో పాటు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

పారా అథ్లెటిక్స్‌లో సత్తా



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సిటీ: గోవాలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. షాట్‌పుట్ (ఎఫ్–56)లో సాకే బాబు గోల్డ్ మెడల్ సాధించాడు. నీలం పల్లవి, నీలం సంజయ్‌రెడ్డి(డిస్కస్‌త్రో) సిల్వర్ పతకాలు సాధించారు. విజేతలను శనివారం పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అభినందించారు. అసోసియేషన్ సెక్రటరీ రామస్వామి, కోచ్ మంజులకు అభినందనలు తెలిపారు.

రైల్వేస్టేషన్ తనిఖీ

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో శనివారం గుంతకల్లు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 'అమృత్ భారత్' పథకంలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యత ప్రామాణాలను పాటించాలని ఆదేశించారు. నమూనా ప్రకారం పనులను చేపట్టాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

ఆమె సంకల్పం.. ఆదర్శం

- ఆటోడ్రైవర్లుగా రాణిస్తున్న మహిళలు
- నూతన 'ఉపాధి మార్గం'లో సత్తా
- కుటుంబానికి చేదోడు

సాక్షి, అనంతపురం డెస్క్: నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అంతరిక్షం నుంచి ఐటీ వరకూ సత్తా చాటుతున్నారు. ఒకప్పుడు పురుషులకు మాత్రమే అనుకున్న రంగాల్లోనూ నేడు మహిళలు ప్రవేశిస్తున్నారు. ఎవరికీ ఎందులోనూ తీసిపోమని నిరూపిస్తున్నారు. వాహన రంగంలో ఒకప్పుడు మహిళలు పెద్దగా కన్పించేవారు కాదు. డ్రైవర్లుగా పనిచేయడం కష్టంతో కూడుకున్నదని భావించేవారు. అయితే.. ప్రస్తుతం వారి దృక్పథంలో మార్పు వచ్చింది. వాహన రంగంలోకీ పెద్ద సంఖ్యలో ప్రవేశిస్తున్నారు. విమాన పైలట్లుగా, రైల్వే లోకో పైలట్లుగా, బస్సు, ట్యాక్సీ, ఆటో డ్రైవర్లుగా సత్తా చాటుతున్నారు. మెట్రోపాలిటన్ నగరాల్లో అయితే మహిళా డ్రైవర్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది.

ఆటోడ్రైవర్లుగా అతివలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు మహిళా ఆటోడ్రైవర్లు ఎక్కడా కన్పించేవారు కాదు. మహిళలు ఆటో నడపడం వింతగా భావించేవారు. కానీ నేడు ఉమ్మడి జిల్లాలో సుమారు 50 మంది మహిళలు ఆటోడ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. అత్యధికంగా అనంతపురం నగరంలో 30 మంది దాకా ఉన్నారు. హిందూపురం, ధర్మవరం, తాడిపత్రి తదితర ప్రాంతాల్లోనూ జీవనోపాధి కోసం మహిళలు ఆటోలను ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ప్రయాణికులను చేరవేస్తుండగా..మరి కొందరు వస్తు రవాణా కోసం ఆటోలను నడుపుతున్నారు.

ప్రభుత్వ తోడ్పాటు..

జీవనోపాధి కోసం ఆటోలను ఏర్పాటు చేసుకుంటున్న మహిళలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా 'ఉన్నతి- మహిళా శక్తి' పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటోల కొనుగోలు కోసం వడ్డీలేని రుణాలు అందిస్తోంది. ఈ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో అనంతపురం జిల్లాలో 13 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో ఆరుగురు మహిళలు ఆటోలు సమకూర్చుకున్నారు. అలాగే ఆటో నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఏటా రూ.పది వేల ఆర్థికసాయాన్ని వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ప్రభుత్వం అందజేస్తోంది. ఆటో/వాహన డ్రైవింగ్‌పై ఆసక్తి ఉండి..జీవనోపాధి మార్గంగా ఎంచుకోవాలనుకునే మహిళలకు రూడ్‌సెట్, ఏఎఫ్ ఎకాలజీ వంటి సంస్థలు శిక్షణ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు మహిళలు ఆటోలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు.



ఈమె పేరు వరలక్ష్మి. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి. ఒకప్పుడు దినసరి కూలీగా వెళ్లేది. అలాగే గ్రామంలోని మహిళా సంఘాల రికార్డులు రాస్తూ జీవనం సాగించేది. ఇప్పుడు నార్పల – అనంతపురం మార్గంలో ఆటో నడుపుతోంది. అన్ని ఖర్చులు పోనూ రోజుకు రూ.వెయ్యి దాకా ఆదాయం లభిస్తోంది. ఆటో వల్ల ఆమెతో పాటు భర్తకూ ఉపాధి లభిస్తోంది.



ఈమె పేరు శాంతి. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామం. ఈమెకు గ్రామంలోనే కిరాణా కొట్టు ఉంది. అనంతపురం వెళ్లి సరుకులు కొనుగోలు చేస్తుంటారు. ఇంతకుముందు బాడుగ ఆటోల్లో తెచ్చుకునేవారు. ఇప్పుడు సొంత ఆటో సమకూర్చుకున్నారు. స్వయంగా ఆటో సరుకులు తేవడమే కాదు.. వాటిని చుట్టుపక్కల గ్రామాలకు తీసుకెళ్లి విక్రయిస్తోంది. తద్వారా ఆదాయం కూడా పెరిగిందని ఆమె చెబుతోంది.

పట్టుదలతో ఆటో నేర్చుకున్నా..



ఇంతకుముందు కూలి పనులకు వెళ్లేదాన్ని. ఉన్నతి పథకం కింద ఆటో కొనుగోలు చేశా. పట్టుదలతో డ్రైవింగ్ నేర్చుకున్నా. మా ఊరి నుంచి అనంతపురానికి నడుపుతున్నా. ప్రయాణికుల ఆదరణ బాగుంది. మహిళలన్న చిన్న చూపు లేదు. రోజూ రూ.700 నుంచి రూ.900 వరకు ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణ, పిల్లల చదువులు సాఫీగా సాగిపోతున్నాయి.

– సాలమ్మ, వెంకటంపల్లి, బుక్కరాయసముద్రం మండలం

స్కూల్ పిల్లలను చేరవేస్తున్నా..



ఓ ప్రైవేటు స్కూల్లో ఆయాగా పనిచేస్తున్నా. అలాగే ఆటో కూడా కొన్నా. స్కూల్ పిల్లలను ఇంటి నుంచి బడికి, అక్కడి నుంచి ఇంటికి చేరవేస్తుంటా. ఖర్చులు పోను రోజుకు రూ.800 దాకా మిగులుతోంది. ఆటో కొనుగోలుకు ప్రభుత్వం వడ్డీ లేని రుణం అందించింది.

– పవన కుమారి, చిన్మయ నగర్, రాప్తాడు మండలం

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి



మృతి చెందిన సంతోష్

వజ్రకరూరు: ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన మేరకు.. కొనకొండ్లకు చెందిన హరికృష్ణ, మాధవి దంపతులు. ఒక కుమార్తె, కుమారుడు సంతోష్ (4) సంతానం. కౌలుకు తీసుకున్న పొలంలో వ్యవసాయ పనుల కోసం శనివారం ట్రాక్టర్‌ను బాడుగకు మాట్లాడుకుని కుటుంబంతో కలిసి హరికృష్ణ వెళ్లారు. పనులు చేస్తుండగా, డ్రైవర్ పక్కనే సంతోష్ కూర్చున్నాడు. ట్రాక్టర్ రివర్స్ చేస్తున్న సమయంలో కుదుపులకు కింద పడిపోయాడు. ఓ చక్రం తలపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తల్లిదండ్రులు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మరణించినట్లు నిర్ధారించారు. బాలుడి తల్లి మాధవి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ షాకీర్‌పై కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శింగనమల: మండలంలోని ఆకులేడు శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. రూ.17,040, 4 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం, సమానత్వం అమలు సాధ్యమని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. స్వతంత్ర భారతావనిలో సామాజిక న్యాయం, సామాజిక సమానత్వం మాటల్లో కాక చేతుల్లో చేసి చూపిస్తోంది ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్కరేనన్నారు. కొంతమంది టికెట్టు దక్కలేదనే అక్కసుతో సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల్లో తిరగాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, పనితీరు సరిగాలేకుంటే టికెట్లు ఇచ్చే ప్రసక్తే లేదని సీఎం ముందే హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కొలుసు పార్థసారథి వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్‌గా పదవులు అనుభవించి, నేడు టికెట్టు రాలేదనే అక్కసుతో లేనిపోని ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజల్లో తిరగకుండా, ప్రజా సేవ చేయకుండా టికెట్ ఆశించడం అత్యాశే అవుతుందన్నారు. అంబేడ్కర్, పూలే ఆశయ సాధన కోసం నేడు సామాజిక న్యాయం, సామాజిక సమానత్వాన్ని పాటిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రజల్లో ఆదరణ లేకే టికెట్ గల్లంతయిన విషయాన్ని గమనించాలని హితవు పలికారు. లోక్‌సభ, రాజ్యసభల్లాంటి అత్యున్నత చట్టసభల్లో ఇంతవరకు ఎప్పుడూ అడుగుపెట్టని వెనుకబడిన వర్గాలకూ గౌరవంగా అడుగుపెట్టేలా చేసి సామాజిక న్యాయం పాటించింది వైఎస్ జగనే నన్నారు. వైఎస్సార్ సీపీలో బీసీలకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సామాజిక సాధికార యాత్రలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనే తెలియజేస్తోందన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లోనూ 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ప్రభుత్వం ఇదేనన్నారు. వైఎస్ జగన్ ప్రజలను నమ్ముతారని, పార్థసారథిలాంటి ఊసరవెల్లి నేతలను కాదన్నారు.

పులివెందుల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి



అనంతపురం మెడికల్: పులివెందుల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీదేవి బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈమె అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ఆమెకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పించి పులివెందుల వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించింది.

కానిస్టేబుల్‌పై అల్లరిమూకల దాడి

అనంతపురం క్రైం: స్థానిక ఆర్టీసీ బస్టాండులో అల్లరి మూకలు హల్‌చల్ చేశారు. కానిస్టేబుల్ లక్ష్మన్నపై దాడి చేశారు. త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్, ఎస్ఐ గోపాలుడు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. 5వ రోడ్డుకు చెందిన బుడగ జంగాల శివకృష్ణ, హరికృష్ణ, చిన్నికృష్ణ అన్నదమ్ములు. శనివారం తెల్లవారు జామున ఆర్టీసీ బస్టాండులో మద్యం తాగారు. ప్రయాణికులతో గొడవకు దిగారు. బస్టాండు ఔట్‌పోస్ట్ పోలీసులు వారించగా.. వారిపైనా దౌర్జన్యం చేశారు. కానిస్టేబుల్ లక్ష్మన్నను గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని అల్లరిమూకలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా, తాగుబోతులు ఆర్టీసీ బస్టాండును తమ అడ్డాగా మార్చుకున్నారని పలువురు స్థానికులు వాపోయారు. తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రముఖుల పేరుతో సైబర్ మోసాలు

- ఆట కట్టించిన పోలీసులు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: ప్రముఖుల పేరుతో సైబర్ మోసాలకు తెగబడుతున్న ఓ మాయగాడి ఆట కట్టించారు అనంతపురం వన్‌టౌన్ పోలీసులు. సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన రిజ్వాన్, తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మితో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ అధికారుల ఫోటోలను సేకరించేవాడు. వాట్సాప్ ప్రొఫైల్స్‌గా పెట్టుకుని కొందరి అధికారులకు ఫోన్లు చేసేవాడు. మాయమాటలతో చాటింగ్ చేస్తూ డబ్బులు లాగేవాడు. దీనిపై పలువురి ఫిర్యాదు మేరకు అనంతపురం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇప్పటికే విజయలక్ష్మిని అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే ఏఎస్ఐ రజాక్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ నాయుడు, కానిస్టేబుల్ మహ్మద్ బృందంగా ఏర్పడి రాజస్తాన్ వెళ్లారు. నిందితుడిని పట్టుకున్నారు. శనివారం అనంతపురం తీసుకొచ్చారు. మహిళల ఫోటోలను వాట్సాప్‌లో డీపీగా పెట్టుకుని చాటింగ్ చేయడం, అశ్లీల వీడియోలు పంపడం, అవతలి వ్యక్తుల ఫోటోలు, వీడియోలు సేకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానంటూ రిజ్వాన్ మోసాలకు పాల్పడేవాడని సీఐ వెల్లడించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా, ఏ మూల దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

సైబర్ మోసం.. యువకుడి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం: సైబర్ నేరగాళ్ల వలలో పడిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన స్థానిక పాతూరులో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. పాతూరుకు చెందిన యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. కొన్ని రోజుల క్రితం తన సెల్‌కు ఓ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. రూ. 1.000 తమ ఖాతాలో వేస్తే రూ. 1,600 ఇస్తామని దాని సారాంశం. దీంతో ఆశ పడిన యువకుడు డబ్బు వేయడం ప్రారంభించాడు. కొంత తిరిగి ఇస్తుండడంతో మరింత ఎక్కువ పంపసాగాడు. ఇంట్లోని బంగారం సైతం తాకట్టు పెట్టి రూ. 8 లక్షల మేర బదిలీ చేశాడు. భారీ మొత్తంలో డబ్బు వేయించుకున్న సైబరాసురులు చేతులెత్తేశారు. అటు వైపు నుంచి సమాధానం రాకపోవడంతో చేసేది లేక తనువు చాలించాలనుకున్నాడు. 5 రోజుల క్రితం ఉరి వేసుకునేందుకు యత్నించాడు. గుర్తించిన తల్లి బిడ్డను ఓదార్చింది. వెంటనే కుమారుడితో కలిసి పోలీసులను ఆశ్రయించింది. వివరాలు సేకరించిన వారు దర్యాప్తు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఖాతాల్లోకి డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. వాటిని ప్రస్తుతానికి ఫ్రీజ్ చేయించారు. ఆ ఖాతాల్లో రూ.5 లక్షల దాకా నగదు ఉన్నట్లు తెలుస్తోంది. పంజాబ్ పేరుతో నడిచే ఓ బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు నడిపినట్లు తెలుస్తోంది.

విద్యావంతులే మోసపోతున్నారు..

ఏదైనా సమస్య ఉంటే 9440796800 నంబరుకు ఫోన్ చేయండంటూ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నిత్యం ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన పెంచుతున్నారు. నిరక్షరాసులు జాగ్రత్త పడుతుంటే విద్యావంతులు మాత్రం నేరగాళ్ల వలలో పడి విలవిలలాడుతుండడం గమనార్హం.

భర్తను కడతేర్చిన భార్య

బనశంకరి (బెంగళూరు): ప్రియుడితో కలిసి భర్తను ఓ భార్య హత్యచేసింది. బెంగళూరు ఆగ్నేయ విభాగ డీసీపీ సీకే.బాబా శనివారం వివరాలను వెల్లడించారు. పుట్టపర్తి మండలానికి చెందిన నందిని బాయి, భర్త వెంకటరమణ నాయక్ (30) హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో నివాసం ఉండేవారు. వీరికి సంతానం లేదు. వెంకటరమణ పగటివేళ ఒక షాపులో, రాత్రి వేళ ఓ ఇంటి వద్ద సెక్యూరిటీ గార్డుగా పనులు చేసేవాడు. భార్య నందినిబాయి తమ ఊరికే చెందిన ప్రియుడు నితీశ్ కుమార్‌ను తరచూ ఇంటికి పిలిపించుకునేది. నితీశ్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఈ నెల 6న వెంకటరమణ విధులకు వెళ్లగా, నందినిబాయి ప్రియుడిని ఇంటికి పిలిపించింది. అయితే ఆ రోజు పనిలేదని కొంతసేపటికే భర్త తిరిగి వచ్చాడు. భార్య, ప్రియుడు పడకగదిలో ఉండడం చూసి కోపంతో గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే నితీశ్ కుమార్‌తో కలిసి నందినిబాయి వెంకటరమణ తలపై రుబ్బుగుండుతో దాడిచేసి అంతమొందించింది. అనంతరం మృతదేహాన్ని బాత్‌రూంలో పడేశారు. పోలీసులకు ఫోన్‌చేసి తన భర్త గుండెపోటుతో మరణించాడని చెప్పింది. వారు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం చేసి గుండెపోటు కాదని హత్య అనే అనుమానం ఉందని తెలిపారు. పోలీసులు విచారణ చేయగా విషయం అంతా వివరించింది.

చదువుతోనే పేదరికం దూరం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఎంపీ రంగయ్య

అనంతపురం ఎడ్యుకేషన్/టవర్‌క్లాక్: చదువుతోనే పేదరికాన్ని దూరం చేయొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివి అత్యున్నత ప్రతిభ చాటిన బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థులకు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్,రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారిలో చైతన్యం రగిలించిన విప్లవ జ్యోతి మహాత్మజ్యోతిరావు పూలే అన్నారు. దేశం ప్రగతి పథంలో నడవాలన్నా, త్వరితగతిన సమాజంలో మార్పు రావాలన్నా అది విద్య ద్వారానే సాధ్యమని తలచి తన భార్య సావిత్రిబాయి పూలేను చదివించి బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షులు పిడుగు శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి ఎస్.శివ ప్రసాద్, వైఎస్సార్‌టీఎఫ్ కుమ్మర ఓబుళపతి, రిటైర్డ్ ప్రిన్సిపల్ రంగస్వామి, హంపాపతి గోవిందు, జాకీర్‌హుసేన్, ఎస్ఆర్ నాగభూషణం, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్కేయూ పరీక్షల విభాగం తనిఖీ



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగాన్ని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. జవాబు పత్రాల మూల్యాంకనాన్ని పరిశీలించారు. విద్యార్థుల భవిత మూల్యాంకనంపై ఆధారపడి ఉందని, ఈ నేపథ్యంలో మూల్యాంకనం జాగ్రత్తగా చేయాలన్నారు. మూల్యాంకనంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నానీల నాగేంద్రకు ఆత్మీయ సత్కారం

అనంతపురం కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తెలుగుభాషా సేవా ప్రతిభా పురస్కారం అందుకున్న కవి నానీల నాగేంద్రను మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్ ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, కవులు పూజారి ఈరన్న, బుక్ హౌస్ సిబ్బంది చెట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య సురభి సేవలు ఆదర్శనీయం



నిరుపేదలకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: 'నిత్య సురభి' సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ తెలిపారు. శనివారం ఆదర్శనగర్‌లోని 21 నిరుపేద కుటుంబాలకు నిత్య సురభి చారిటబుల్ ట్రస్టు , పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో 24 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్టినిల్లు ఆశ్రమ నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ, డాక్టర్ నిర్మల మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని అందరి ఇంటా ఆనందాలు పరవళ్లు తొక్కాలన్న ఉద్దేశంతో నిత్యావసర వస్తువులతో పాటు చీరలు, పంజాబి డ్రస్సులను నిరుపేదలకు అందించామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు సౌధామణి, భాగ్యలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

అనంతపురం కార్పొరేషన్:నగరంలోని 13వ డివిజన్‌లో శనివారం డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు సంక్రాంతి సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి పాల్గొన్నారు.

చెత్త తొలగింపు పనుల పరిశీలన



నవోదయ కాలనీలో చెత్త తరలింపు పనులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రోడ్లపై చెత్తాచెదారం కనిపించకూడదని, ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శనివారం నగరంలోని నవోదయ కాలనీ, విద్యుత్‌నగర్, హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు పనులను ఆయన పరిశీలించారు. చెత్త తరలింపులో నిర్లక్ష్యం చూపకూడదన్నారు. వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తరలించాలన్నారు. అదనపు కమిషనర్ వెంట కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, తదితరులున్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

అనంతపురం: కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నందిగామ (విజయవాడ)లో హెల్త్ కేర్ కౌన్సెలర్/కో–ఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ పూర్తి చేసి 19 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 60 రోజుల పాటు శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి కల్పించనున్నట్లు వివరించారు. హెల్త్‌కేర్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఊరంతా సందడి..

వెల్లివిరిసిన సం'క్రాంతి'

సంక్రాంతి పండుగ రానే వచ్చింది.. సంస్కృతీ సంప్రదాయాలను వెంట తెచ్చింది..

పాత బాధలు మరిపించి, కొత్తగా ఆనందాలను తెచ్చింది. మూన్నాళ్ల పండుగకు పల్లె, పట్టణం ముస్తాబవుతోంది. ఊరు, వాకిలి మురిసిపోతుంటే.. ప్రతి లోగిలిలో ఆనందాలు వెల్లివిరుస్తుంటే.. ఆడపడచులు కళ్లాపి చల్లి, గొబ్బెమ్మలు ఉంచి, పాలపొంగులు పెట్టి, భోగి మంటలకు సిద్ధం చేస్తుంటే.. వీధి వీధిలో బసవన్నలు సందడి చేస్తుంటే.. చంటిబిడ్డలకు రేగుపండ్లతో తల్లులు స్నానాలు చేయించి కొత్త దుస్తులు తొడిగిస్తుంటే.. రైతన్నలు ధాన్యపురాశులకు పూజలు చేస్తుంటే.. పూటకో రకం పిండివంటలు సిద్ధం చేస్తుంటే.. యువత పందేలు,పిల్లలు ఆటపాటల్లో మునిగిపోతుంటే.. ప్రతి ఇంటా తెలుగుదనం ఉట్టిపడుతోంది.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు





గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



కమ్మలు కొనుగోలు చేస్తూ....



కొనుగోలుదారులతో దుస్తుల దుకాణాలు సందడి



ప్రయాణికులతో కిక్కిరిసిన రైల్వే స్టేషన్

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

• జగనన్న కాలనీని పరిశీలించిన ఎమ్మెల్యే అనంత



ఆలమూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. శనివారం ఆలమూరు వద్ద ఉన్న జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలపై ఆరా తీసిన ఆయన.. నాణ్యత ప్రమాణాలతో నిర్మించేలా చూడాలన్నారు. పనులు జాప్యం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అక్కడ నివాసం ఉంటున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు అందించనున్నట్లు తెలిపారు. నగర పరిధిలోని 23 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. పేద ప్రజల సొంతింటి కల సాకారం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ, ప్రతి పథకంలోనూ వారిని భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చూస్తున్నట్లు తెలిపారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి



ఎంబ్రాయిడరీ మిషన్ అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం 50వ డివిజన్ ఇందిరానగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ మేయర్ అందజేశారు. మేయర్ వసీం మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంట్లోనే మహిళలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ అందించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు వివిధ దశల్లో రుణమాఫీ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య పేర్కొన్నారు. నగరానికి రెండు పట్టణ ప్రగతి యూనిట్లు మంజూరైనట్లు మెప్మా పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, సైపుల్లాబేగ్, దుర్గాదేవి, కమల్‌భూషణ్, మెప్మా శ్రీనివాస్ రెడ్డి, సత్యమూర్తి, క్లస్టర్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

• ఆర్టీసీ డ్రైవర్ మృతి, 14 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

కర్నూలు: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. బస్సులోని 14 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి 44వ జాతీయ రహదారిలో ఉలిందకొండ ఫ్లై ఓవర్ పక్కన చోటుచేసుకుంది. బుక్కరాయసముద్రం మండలం అమ్మవారిపేటకు చెందిన ఆంజనేయులు (49) కళ్యాణదుర్గం డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గం నుంచి శ్రీశైలానికి 54 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయల్దేరింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఉలిందకొండ ఫ్లై ఓవర్ పక్కన ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రోడ్డుపక్కన లారీ నిలిపి టైరు మారుస్తుండగా ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రయాణికులు మల్లికార్జున, శిల్ప, సత్య హర్ష, అరుణ, చిన్నమ్మ, హర్షవర్ధన్, సువర్ణ, శివకోటేష్, రసూల్, నాగమణి, లక్ష్మీదేవి, అఖిల, మహబూబ్ బాషా, లాస్యశ్రీలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘటనా స్థలం పరిశీలన : ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు నవదీప్, కూతురు అనూష ఉన్నారు. బస్సు కో డ్రైవర్ శివన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు : ఎలాంటి సేఫ్టీ మెజర్‌మెంట్స్ తీసుకోకుండా జాతీయ రహదారిపై లారీ ఆపి రిపేరీ చేసుకుంటూ ప్రమాదానికి కారణమైన వడ్డె మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు. ఈయనది ప్యాపిలి మండలం రామకృష్ణాపురం గ్రామం. అనంతపురం జిల్లా యాడికి మండలం రాయలచెరువు నుంచి పెయింటింగ్ పౌడర్‌ను హైదరాబాదుకు తీసుకెళ్తుండగా, లారీ ముందు వైపు టైరు పంక్చర్ అయి ఆగిపోయింది.

మార్మోగిన హనుమాన్ చాలీసా పారాయణం



మొదటిరోడ్డు శివాలయంలో ఆంజనేయస్వామి పారాయణం చేస్తున్న భక్తులు



పారాయణం వింటున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అయోధ్య రామమందిరానికి సంఘీభావంగా అనంత వాసులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ధర్మకర్తల మండలి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి బృందం సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 41 సార్లు భక్తులు పారాయణం చేశారు. అనంతరం భక్తులు శ్రీరామ నామస్మరణతో ఆలయాన్ని మార్మోగించారు.

19 వరకు 'జన్ భాగీదారి'

అనంతపురం అర్బన్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పంలో భాగంగా 'జన్ భాగీదారి' కార్యక్రమాలను ఈ నెల 19 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 'జన్ భాగీదారి' నిర్వహణపై కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ఆవిష్కరించనున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఈ నెల 9 నుంచి ఇప్పటి వరకు 663 సచివాలయాల పరిధిలో సిటిజన్ల రిజిస్ట్రేషన్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయడం, సోషల్ అవేర్‌నెస్ క్యాంపులు, ఫ్లెక్సీలపై సంతకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 17న అంబేడ్కర్ విగ్రహాలను సుందరీకరించి పూలమాలతో అలంకరించాలన్నారు. 18న గ్రామ, పట్టణ ప్రాంతాల్లో మానవహారాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో మారథన్, రక్తదాన శిబిరాలు, జిల్లాస్థాయి ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, రెవెన్యూ భవన్‌లో జిల్లా సమావేశం నిర్వహించాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

18న అశ్వర్థంలో బహిరంగవేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కు కోసం ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి శనివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

నగర పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ప్రజలకు ఆహ్లాదకర వాతారణాన్ని పంచేందుకు దశలవారీగా పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని 50వ డివిజన్ అరుణోదయ కాలనీలోని మహిళా పార్కులో రూ.15.70 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మేయర్ భూమి పూజ చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్కుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాంనగర్, రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్, నీరు ప్రగతి వనంలో చిన్నారులకు ఆట స్థలం, ప్రహరీ మరమ్మతులు, ఆకర్షణీయమైన రంగులు, వాకింగ్ ట్రాక్, కూర్చునేందుకు బెంచీలు, తదిత, ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. వివిధ డివిజన్లలో రోడ్లు, కాలువల పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. వీధి దీపాల ఏర్పాటు పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు గురుశేఖర్ బాబు, కమల్‌భూషణ్, సైపుల్లాబేగ్, మాజీ కార్పొరేటర్ గురు బిందు ప్రియ, పార్టీ నాయకులు సులోచన, మహబూబ్ బాషా, అనిల్, నరేంద్ర, ఈఈ సూర్యనారాయణ, డీఈ రవీంద్ర రెడ్డి, ఏఈ శంకర్, సచివాలయ కార్యదర్శి శంకర్‌రెడ్డి, సీఓ శిరీష, పాల్గొన్నారు.

సమాజ ప్రగతికి జేవీవీ కృషి అభినందనీయం



ప్రజా సైన్సు గీతాలు సీడీలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాచపాలెం తదితరులు

అనంతపురం కల్చరల్: సమాజ ప్రగతికి జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక భైరవనగర్‌లోని జేవీవీ కార్యాలయంలో ప్రజా సైన్సు గీతాల సీడీలు ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వెనుకబాటుతనాన్ని తొలగించడానికి జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అన్ని వర్గాల వారు జేవీవీలో పనిచేస్తున్నారన్నారు. ప్రజా కవులు ఆలపించిన సైన్సు గీతాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయని గాయనీగాయకులను అభినందించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జేవీవీ నాయకులు గాంగే నాయక్, జిలాన్‌బాషా, రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ



అలంకరణలో లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విశేష అభిషేకం, మహమంగళహారతి, కుంకమార్చన తో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని ఆలయ పురవీధుల్లో ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. నమో నారసింహ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

సంక్రాంతిని సంబరంగా జరుపుకోవాలి



బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: తెలుగువారి పండుగ భోగి, సంక్రాంతి, కనుమను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. జిల్లా ప్రజలు ప్రతి ఇంటా భోగభాగ్యాలు, సిరిసంపదలతో తులతూగాలని ఆమె ఆకాంక్షించారు. పండుగ ప్రజలందరి జీవితాల్లో సంక్రాతి కొత్త కాంతులు నింపాలని కోరుకున్నారు.

గొల్ల ఈరన్నకు డాక్టరేట్ ప్రదానం



ఈరన్న

అనంతపురం: కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన గొల్ల ఈరన్నకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ పర్యవేక్షణలో వాణిజ్యశాస్త్ర విభాగంలో ఎన్ఎస్ఈ, నిఫ్టీ స్టాక్‌ల అధ్యయనంతో 'స్టాక్ ధర కదలికల గురించి, రాబడి, నికర ఆదాయం, వాటి పని తీరు, వాటి సూచికల అంచనా సామర్థ్యం' అనే అంశంపై పరిశోధన చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి: మండలంలోని ఎగువపల్లి చెక్‌పోస్ట్‌వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. చెక్‌పోస్ట్‌లో వాహన తనిఖీల్లో భాగంగా రాప్తాడు మండలం యర్రగుంట్లకు చెందిన నరసింహులు, నరేష్‌లు ద్విచక్రవాహనంపై 96 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

సంక్రాంతి.. ప్రత్యేక పండుగ

అనంతపురం టవర్‌క్లాక్: సంక్రాంతి పండుగ తెలుగు వారికి ప్రత్యేక పండుగ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు పెట్టారు. న్యాయ నిర్ణేతలుగా యూట్యూబర్ మహిత, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

అనంతపురం రూరల్: స్థానిక శిల్పారామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆదివారం నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్కాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 14న భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, క్లాసికల్ డ్యాన్స్‌తో పాటు జబర్దస్త్ బృందంతో కామెడీ షో ఉంటుందన్నారు. 15న క్లాసికల్ డ్యాన్స్, ఇంద్రజాల ప్రదర్శన, జిమ్నాస్టిక్, మిమిక్రీ ప్రదర్శనలు ఉంటాయన్నారు. 16న నృత్య ప్రదర్శన పాశ్చాత్య నృత్య ప్రదర్శన, పిల్లలకు గాలిపటాలు ఎగురవేసే పోటీలు ఉంటాయన్నారు.

తిరుమల దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని గంగంపల్లి సమీపంలోని తిరుమల దేవర దేవాలయంలో వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయాన్నే స్వామిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలకు మండలవాసులేగాక, కర్ణాటక, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల వాసులు పాల్గొన్నారు. ఆలయంలో రోజూ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

అనంతపురం రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఆర్ ఐటీ విద్యా సంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి నరసింహారెడ్డి హాజర్యయారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాగవత సప్తాహ పఠనం

పుట్లూరు: తక్కళ్లపల్లిలో శనివారం భాగవత భక్త సమాజం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భాగవత సప్తాహ పఠనం నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ నెల 19 వరకు భాగవత సప్తాహ పఠనం కొనసాగుతుందని గౌరవాధ్యక్షుడు సంజీవరెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.



రన్నరప్‌గా బోపన్న జోడి

కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనుకున్న భారత వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశే ఎదురైంది. అడిలైడ్ ఇంటర్నేషనల్ ఏటీపీ -250 టోర్నీలో బోపన్న - మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడి రన్నరప్‌గా నిలిచిపెట్టుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా) - జో సాలిస్‌బరీ ద్వయం 7-5, 5-7, 11-9తో రెండో సీడ్ బోపన్న - ఎబ్డెన్‌పై విజయం సాధించింది. బోపన్న జంట 12 ఏస్‌లు సంధించినా లాభం లేకపోయింది. తొలి సెట్‌లో ఒక దశలో 4-0తో ఆధిక్యంలో ఉండి కూడా బోపన్న టీమ్ దానిని చేజార్చుకుంది. రెండో సెట్‌లో స్కోరు 5-5తో సమంగా ఉన్న సమయంలో ప్రత్యర్థి గేమ్‌ను బ్రేక్ చేసి ముందంజ వేసిన రోహన్ - ఎబ్డెన్ ఆ తర్వాత సెట్‌ను గెలుచుకున్నారు. మూడో సెట్ టైబ్రేకర్‌తో చివరకు రాజీవ్ - సాలిస్‌బరీదే పైచేయి అయింది. ఒక గంటా 38 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో 5 డబుల్ ఫాల్ట్‌లు చేసి కూడా ఈ జంట గట్టెక్కింది.

ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకొని...



- ఫైనల్లో సాత్విక్ - చిరాగ్ జోడి
- మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్

కౌలాలంపూర్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ వేదికపై మరో టైటిల్ సాధించేందుకు భారత ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి అడుగు దూరంలో నిలిచారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ -1000 టోర్నీ మలేసియా ఓపెన్‌లో ఈ జోడి ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకోవడంతో పాటు ఆపై మరో రెండు పాయింట్లు గెలుచుకొని విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో సీడ్ సాత్విక్ - చిరాగ్ 21-18, 22-20 స్కోరుతో ఆరో సీడ్, కొరియాకు చెందిన కాంగ్ మిన్ హ్యూక్ - సియో స్యూంగ్ జాను చిత్తు చేశారు. 47 నిమిషాల పాటు సాగిన మ్యాచ్ సాగింది.

తొలి గేమ్ ఆరంభంలో భారత ఆటగాళ్ల ఆధిక్యం సాగింది. చక్కటి ర్యాలీలతో వీరిద్దరు 9-5తో ముందంజ వేయగా వరుసగా నాలుగు పాయింట్లతో కొరియా ద్వయం స్కోరును సమం చేసింది. అయితే 11-9తో, ఆపై 13-12తో మన జట్టు ఆధిక్యం ప్రదర్శించింది. వరుస పాయింట్లతో 17-13 వరకు దూసుకెళ్లిన చిరాగ్ - సాత్విక్ దానిని కొనసాగించారు. రెండో గేమ్ మాత్రం హోరా హోరీగా సాగింది. అనంతరం 9-4తో...11-6తో ఆధిక్యం చూపించిన కొరియా ఆటగాళ్లు ఒక దశలో 17-11తో గేమ్‌పై పట్టు బిగించారు. ఈ సమయంలో భారత్ కోలుకునే ప్రయత్నం చేసినా 20-14తో గేమ్ గెలిచే స్థితికి కొరియా చేరింది. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. ఒకటి కాదు రెండు కాదు...వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించిన సాత్విక్ - చిరాగ్ సంచలనం సృష్టించారు. నేడు జరిగే ఫైనల్లో చైనాకు చెందిన టాప్ సీడ్ జంట లియాంగ్ వి కెంగ్ - వాంగ్ చాంగ్‌తో సాత్విక్ - చిరాగ్ తలపడతారు. గతంలో ఈ రెండు జోడీల మధ్య 4 మ్యాచ్‌ల జరగ్గా...భారత ద్వయం 1 మ్యాచ్‌లో గెలిచి 3 మ్యాచ్‌లలో ఓడింది.



రోహిత్, దూబే

సిరీస్ గెలిచే లక్ష్యంతో...

- నేడు భారత్, అఫ్గనిస్తాన్ రెండో టి20
- బరిలోకి దిగనున్న విరాట్ కోహ్లి
- రా.7 గం.నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఇండోర్: బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్, వేగవంతమైన అవుట్‌ఫీల్డ్, చిన్న బౌండరీలు...ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో పరుగుల వరదకు రంగం సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇక్కడ జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత్, అఫ్గనిస్తాన్ తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌ను గెలిచి 1-0తో ముందంజలో ఉన్న భారత్ ఈ మ్యాచ్‌నూ సొంతం చేసుకొని సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది.

భారత తుది జట్టులో స్వల్ప మార్పులు జరగనున్నాయి. గత మ్యాచ్ ఆడని విరాట్ కోహ్లి ఇప్పుడు బరిలోకి దిగుతున్నాడు. మరో 35 పరుగులు చేస్తే కోహ్లి టి20 క్రికెట్‌లో 12 వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి భారత ఆటగాడిగా నిలుస్తాడు. కోహ్లి రాకతో గిల్‌ను పక్కన పెట్టడం ఖాయం. అయితే ఓపెనర్ యశస్వి గాయంనుంచి కోలుకుంటే జట్టులోకి వస్తాడు. లేదంటే గిల్‌కు మరో అవకాశం దక్కుతుంది. బౌలింగ్‌లో కూడా లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కు బదులుగా కుల్దీప్ యాదవ్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. పేస్ విభాగంలోనూ మార్పు అవసరం అనుకుంటే ముకేశ్‌ను పక్కన పెట్టి టీమ్ మేనేజ్‌మెంట్ అవేశ్‌కు చాన్స్ ఇవ్వవచ్చు. మరో వైపు అఫ్గనిస్తాన్ మరో సారి తమ స్పిన్‌నే బలంగా నమ్ముకుంటోంది. ముజీబ్, నబీలు కొనసాగనుండగా ముగ్గురు పేసర్లు ఫజల్, నవీన్, గుల్బదిన్‌లు భారత్ బలమైన బ్యాటింగ్ లైనప్‌ను ఎంత వరకు నిలువరిస్తారనేది చూడాలి. మిడిలార్డర్‌లో రహ్మత్ స్థానంలో దూకుడైన బ్యాటర్ అయిన హజ్రతుల్లా జట్టులోకి వస్తాడు. సంచలన ప్రదర్శనతో సిరీస్‌ను సమం చేయాలని అఫ్గన్ జట్టు భావిస్తోంది.

భారత్ పరాజయం



రాంచీ: మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీని భారత జట్టు ఓటమితో మొదలు పెట్టింది. శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో అమెరికా చేతిలో పరాజయంపాలైంది. అమెరికా తరఫున 16వ నిమిషంలో తామెర్ అబిగైల్ ఏకైక గోల్ నమోదు చేసింది. తొలి క్వార్టర్ హోరాహోరీ సాగి ఒక్క గోల్ కూడా నమోదు కాకపోగా, రెండో క్వార్టర్ ఆరంభంలోనే యూఎస్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత భారత మహిళలు ఎన్ని ప్రయత్నాలు చేసినా స్కోరును సమం చేయలేకపోయారు. దురదృష్టవశాత్తూ ఆరు పెనాల్టీ అవకాశాలు వచ్చినా... ఒక్కదానిని కూడా గోల్‌గా మలచలేక భారత్ వృథా చేసుకుంది. నేడు జరిగే తమ తర్వాతి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది.

జైపూర్ పాంథర్స్ గెలుపు

జైపూర్: సొంతగడ్డపై జైపూర్ పింక్ పాంథర్స్ వరుసగా రెండో విజయంతో సత్తా చాటింది. ప్రో కబడ్డీ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 36-34 స్కోరుతో పుణేరీ పల్టన్‌ను ఓడించింది. జైపూర్ తరఫున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 16 పాయింట్లతో చెలరేగాడు. పుణేరీ ఆటగాళ్లలో కెప్టెన్ అస్లామ్ ముస్తఫా 8 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	12	10	2	0	52
జైపూర్ పింక్ పాంథర్స్	12	8	2	2	48
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	12	7	5	0	39
యు ముంబా	11	6	4	1	35
హరియాణా స్టీలర్స్	11	6	4	1	34
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	11	4	5	2	28
యూపీ యోధాస్	12	3	8	1	21
తమిళ్ తలైవాస్	11	3	8	0	19
తెలుగు టైటాన్స్	12	1	11	0	10

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

ఆసియాన్ కప్ ఫుట్‌బాల్



ఇర్విన్

దోహా (ఖతర్): ఆసియాన్ కప్ ఫుట్‌బాల్ టోర్నీని భారత జట్టు పరాజయంతో ప్రారంభించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 2-0 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. ఆసీస్ తరఫున 50వ నిమిషంలో జాక్సన్ ఇర్విన్, 73వ నిమిషంలో జోర్డాన్ బాస్ గోల్స్ సాధించారు. ఆసీస్ ఆటను దూకుడుగా ప్రారంభించింది. ఆరంభంలోనే ఆజీజ్ బెహిచ్ కొట్టిన షాట్ గోల్ పోస్ట్‌కు దూరంగా వెళ్లిపోగా, గుడ్‌విన్ ఇచ్చిన ఫ్రీకిక్‌ను హెడర్‌తో గోల్ చేయడంలో డ్యూక్ విఫలమయ్యాడు. 16వ నిమిషంలో భారత్‌కు గోల్ చేసేందుకు మంచి అవకాశం లభించింది. నిఖిల్ పుజారి క్రాసింగ్ పాస్ అందించగా, కెప్టెన్ సునీల్ ఛెత్రి దానిని గోల్‌గా మలచడంలో విఫలమయ్యాడు. తొలి అర్ధ భాగంలో ఆసీస్‌ను నిలువరించడంలో భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సఫలమయ్యాడు. తమకు లభించిన 11 కార్నర్ కిక్‌లలో ఆసీస్ సఫలం కాలేదు. అయితే రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. మార్టిన్ బాయెల్ కొట్టిన షాట్‌ను గుర్‌ప్రీత్ ఆపగలిగినా...అక్కడే ఉన్న ఇర్విన్ దానిని గోల్‌గా మలిచాడు. 69వ నిమిషంలో కూడా గోల్ చేసేందుకు చేరువైన భారత్ మళ్లీ విఫలమైంది. స్కోరు సమం చేసేందుకు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. కొద్ది సేపటికే సుభాశిష్ బోస్‌ను తప్పించి ర్యాన్ మెక్‌గ్రీ బంతితో దూసుకెళ్లగా...పోస్ట్‌కు దగ్గరలోనే ఉన్న బాస్ దానిని అందుకొని సునాయాసంగా గోల్ సాధించాడు. తమ తర్వాతి మ్యాచ్‌లో గురువారం ఉజ్బెకిస్తాన్‌తో తలపడుతుంది.

హైదరాబాద్ ఘన విజయం

ఇన్నింగ్స్, 81 పరుగులతో మేఘాలయ చిత్తు



మిలింద్

షిల్లాంగ్: రంజీ ట్రోఫీ 'ప్లేట్' గ్రూప్‌లో హైదరాబాద్‌లో వరుసగా రెండో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. గత మ్యాచ్‌లాగే ఈ సారి కూడా రెండు రోజుల్లోనే ముగిసిన పోరులో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్, 81 పరుగుల తేడాతో మేఘాలయాను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 182/4తో శనివారం ఆట కొనసాగించిన హైదరాబాద్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 7 వికెట్ల నష్టానికి 346 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రోహిత్ రాయుడు (216 బంతుల్లో 124 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా, దూకుడుగా ఆడిన సీవీ మిలింద్ (38 బంతుల్లో 50 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. హైదరాబాద్‌కు 235 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం మేఘాలయ తమ రెండో ఇన్నింగ్స్‌లో 36.1 ఓవర్లలో 154 పరుగులకే కుప్పకూలింది. జస్కిరత్ సింగ్ (53), కిషన్ లింగ్డో (47) రాణించారు. తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టగా...రవితేజ, మిలింద్ చెరో 2 వికెట్లు తీశారు.

ఆంధ్ర 98/3

ముంబై: 'ఎలైట్' డివిజన్‌లో భాగంగా ముంబైతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర తడబడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (23), విహారి (6), షేక్ రషీద్ (3) వెనుదిరగ్గా...ప్రశాంత్ కుమార్ (59 నాటౌట్), రికీ భుయ్ (4 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు 281/6తో ఆట కొనసాగించిన ముంబై తమ మొదటి ఇన్నింగ్స్‌లో 395 పరుగులకు ఆలౌటైంది. తనుష్ కొటియన్ (54), మోహిత్ అవస్థి (53) అర్ధ సెంచరీలు చేశారు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి 5 వికెట్లు పడగొట్టగా...షోయబ్, లలిత్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం ఆంధ్ర మరో 297 పరుగులు వెనుకబడి ఉంది.


ఒలింపిక్ బెర్త్ నంబర్ 17

- షూటర్ విజయ్‌వీర్‌కు రజతం
- ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్



జకార్తా: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌నుంచి మరో బెర్త్ ఖాయమైంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ ఈ కోటాను ఖాయం చేశాడు. దీంతో భారత్ నుంచి పాల్గొనే షూటర్ల సంఖ్య 17కు పెరిగింది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో విజయ్‌వీర్ శనివారం రజత పతకం గెలుచుకున్నాడు. అయితే పతకం గెలుచుకోవడానికి ముందే అతనికి ఒలింపిక్ బెర్త్ ఖాయమైంది. క్వాలిఫయింగ్ దశలో 577 పాయింట్లు సాధించిన విజయ్‌వీర్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌కు చేరిన ఆరుగురిలో నలుగురికి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉండగా అతనికి ఈ చాన్స్ లభించింది. చండీగఢ్‌కు చెందిన 21 ఏళ్ల వీర్ గత ఏడాది హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించాడు. మరో వైపు మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు 2 పతకాలు లభించాయి. ఈ ఈవెంట్‌లో సిఫ్ట్‌కౌర్ రజతం గెలుచుకోగా, ఆషి చౌక్సీకి కాంస్యం దక్కింది.

సినిమా



లోహ్రీ రోజు దానం చేయాలి

- అమితాబ్ బచ్చన్

సంక్రాంతి పండగ సంబరాలు ఆరంభమయ్యాయి. కొందరు బాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

''అందరికీ లోహ్రీ (భోగి పండగ) శుభాకాంక్షలు. లోహ్రీ అంటే నాకు చాలా విషయాలు గుర్తుకొస్తాయి. లోహ్రీ రోజు జానపద కళాకారులు 'లోహ్రీ దా టక్కా దే, రబ్ యానూ బచ్చా దే' అంటూ పాటలు పాడుకుంటూ ఇంటింటికీ వచ్చినప్పుడు వారికి దానం ఇవ్వడం ఆనవాయితీ. నా చిన్నప్పుడు మా అమ్మగారు ఇలా పండగ తాలూకు విషయాలు చెప్పేవారు'' అని సోషల్ మీడియా ద్వారా అమితాబ్ బచ్చన్ షేర్ చేశారు.

''లోహ్రీ తాలూకు వెచ్చదనాన్ని, పండగ సందర్భంగా మా అమ్మగారు చేసిన స్వీట్స్‌ని తలుచుకుంటున్నాను. ఇరుగు పొరుగుతో పంచుకున్న నవ్వులతో నా మనసు నిండిపోయేది. నేటి బిజీ జీవితంలో అప్పటి ఆనందకర సాధారణ రోజులను తలచుకుని, ఆనందిస్తున్నాను. అందరి జీవితాల్లో లోహ్రీ ఆనందం నింపాలని కోరుకుంటున్నా'' అని సన్నీ డియోల్ పేర్కొన్నారు. ఇంకా అక్షయ్ కుమార్, సంజయ్ దత్, విక్కీ కౌశల్, ఇషా డియోల్, నేహా ధూపియా వంటి తారలు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.



సన్నీ డియోల్

టార్గెట్ ఫిక్స్



అల్లు అర్జున్

టార్గెట్ ఫిక్స్ చేశాడు పుష్పరాజ్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప: రైజ్' ఘనవిజయం సాధించడంతో, మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్.

యాభై శాతానికి పైగా సినిమా పూర్తయింది. బ్యాలెన్స్ షూటింగ్‌ను మే నెలాఖరుకల్లా పూర్తి చేసేలా టార్గెట్ ఫిక్స్ చేసుకుని, అందుకు అనుగుణంగా సుకుమార్ షూటింగ్ ప్లాన్ సిద్ధం చేశారని సమాచారం. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, ఈ సినిమా వీఎఫ్ఎక్స్, ఎడిటింగ్ వర్క్స్‌పై మరింత ఫోకస్ పెట్టాలని సుకుమార్ భావిస్తున్నారట. 'పుష్ప' సినిమాలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్న అల్లు అర్జున్‌కు జోడీగా శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

బాగుండే ఏ సినిమానీ ఎవరూ ఆపలేరు

- నిర్మాత 'దిల్' రాజు

''ఇండస్ట్రీలో ఎవరికి ఎవరూ శత్రువులు కాదు.. మిత్రులు కాదు. సినిమా అంటే వ్యాపారం. వ్యాపార కోణంలో కొన్ని సమీకరణాలు ఉంటాయి. ప్రతి సంక్రాంతికి మా మధ్య వార్స్ జరగడం సాధారణమే. అయితే బాగుండే ఏ సినిమానీ ఎవరూ ఆపలేరు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. మహేశ్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్, జయరాం కీలక పాత్రలు పోషించారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా విలేకర్ల సమావేశంలో నిర్మాత, పంపిణీదారుడు 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గుంటూరు కారం' నైట్ షోలకు కాస్త నెగటివ్ టాక్ వచ్చింది. కానీ షో బై షో పాజిటివ్‌గా మారుతోంది. సినిమాలో మహేశ్‌బాబుగారి క్యారెక్టరైజేషన్ బాగుంది. తల్లీకొడుకుల ఎమోషనల్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'గుంటూరు కారం'. నేను థియేటర్‌లో సినిమా చూశాను. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. 'బాగోలేదంట' అనే టాక్ విని ప్రేక్షకులు ఆ సినిమాకు వెళ్లి, చూసిన తర్వాత అవి బ్లాక్‌బస్టర్స్ అయిన సినిమాలు కొన్ని ఉన్నాయి. ఓ సినిమాకు ఉన్న నెగటివ్ టాక్స్ కలెక్షన్స్ చూసిన తర్వాతే పోతాయి. ఫైనల్ నంబర్స్‌ని పండగ తర్వాత చెబుతాం'' అన్నారు. ''ఈ పండక్కి ఫ్యామిలీతో కలిసి థియేటర్స్‌లో 'గుంటూరు కారం' చూడండి. ప్రేక్షకులు ఎంటర్‌టైన్ అవుతారన్న గ్యారంటీ నాది'' అన్నారు సూర్యదేవర నాగవంశీ.



నాగవంశీ, 'దిల్' రాజు

ఆస్కార్ లైబ్రరీలో జోరమ్

హిందీ చిత్రం 'జోరమ్' చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ లైబ్రరీలో ఈ సినిమాకు చోటు దక్కింది. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో మనోజ్ బాజ్‌పాయ్, మొహమ్మద్ జీషన్ అయ్యూబ్, తన్నిష్ఠ ఛటర్జీ ప్రధాన పాత్రధారులుగా ఈ సినిమా రూపొందింది. జీ స్టూడియోస్, మఖిజా ఫిలింస్ ఈ సినిమాను నిర్మించాయి. గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రోటర్‌డామ్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, జూన్‌లో సిడ్నీ ఫిల్మ్ ఫెస్టివల్, జూలైలో దర్బన్ ఫిల్మ్ ఫెస్టివల్, అక్టోబరులో 28వ బూసాన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, 59వ చికాగో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమా ప్రదర్శితమైంది. థియేటర్స్‌లో గత ఏడాది డిసెంబరు 8న విడుదలైంది. ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మాత్రం మెరుగైన ఫలితం దక్కలేదు. అయితే తాజాగా ఈ సినిమా వందేళ్ల చరిత్ర ఉన్న ఆస్కార్ లైబ్రరీలో చోటు దక్కించుకుంది. ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేశారు మనోజ్ బాజ్‌పాయ్. ''నా చిత్రానికి ఇలాంటి గౌరవం దక్కడం సంతోషంగా ఉంది. ఇది యూనిట్ సమష్టి విజయం. మనం ఎంత చేయగలమో మనకే తెలుసు'' అని పేర్కొన్నారు మనోజ్. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే.. తన కుమార్తె ప్రాణాలను కాపాడటం కోసం ఓ తండ్రి చేసే పోరాటం నేపథ్యంలో సాగే సర్వైవల్ డ్రామాగా 'జోరమ్' తెరకెక్కింది. 2016లో 'తాండవ్' షార్ట్ ఫిల్మ్, 2020 జూన్‌లో 'భోంస్లే' (ఇండియా రిలీజ్) చిత్రాల తర్వాత హీరో మనోజ్ బాజ్‌పాయ్, దర్శకుడు దేవాశిష్ మఖిజా కాంబినేషన్‌లో రూపొందిన మూడో చిత్రం 'జోరమ్'.



'జోరమ్'లో మనోజ్ బాజ్‌పాయ్

ఆలియా అవుట్.. జాన్వీ ఇన్?



ఆలియా భట్

హిందీలో 'దుల్హనియా' ఫ్రాంచైజీలో వచ్చిన 'హంప్టీ శర్మా కీ దుల్హనియా', 'బద్రీనాథ్ కీ దుల్హనియా' చిత్రాల్లో వరుణ్ ధావన్, ఆలియా భట్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాలకు శశాంక్ కేతన్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ ఫ్రాంచైజీలో మూడో భాగానికి కేతన్ ప్రయత్నాలు మొదలు పెట్టారని బాలీవుడ్ సమాచారం. వరుణ్ ధావన్, ఆలియా భట్‌లను కూడా సంప్రదించారట. అయితే వరుణ్ ధావన్ సుముఖంగానే ఉన్నా, ఇప్పటికే అంగీకరించిన చిత్రాల కారణంగా ఆలియా మాత్రం ఈ సినిమాలో నటించలేకపోతున్నారట. ఈ నేపథ్యంలో ఈ చాన్స్ జాన్వీ కపూర్‌కు వెళ్లిందట. ఈ సినిమాకు జాన్వీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఊపందుకున్నాయని టాక్. వేసవిలో షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం.



జాన్వీ కపూర్

ఐదు రోజులు గాల్లోనే ఉన్నాను

- తేజ సజ్జా

"ప్రతి యాక్టర్ కెరీర్‌లో ఓ బెంచ్ మార్క్ ఫిల్మ్ ఉంటుందంటుంటారు. నా కెరీర్‌లో 'హను–మాన్'ని నా బెంచ్ మార్క్ ఫిల్మ్‌గా ఫీలవుతున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. క్లైమాక్స్‌లో ఓ సన్నివేశం కోసం రోప్ సాయంతో ఐదు రోజులు గాల్లోనే ఉన్నాను. రెండున్నరేళ్లు ఏ సినిమా ఒప్పుకోలేదు. యాక్టర్‌గా నా కెరీర్ పరంగా, నా వయసు పరంగా ఈ రెండున్నరేళ్ల కాలం చాలా కీలకమైనది. 'హను–మాన్' సక్సెస్ కావడం సంతోషంగా ఉంది" అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'హను–మాన్'. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. 'హను–మాన్'కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని చెబుతూ, శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో తేజ సజ్జా పంచుకున్న విశేషాలు.

- తెలుగుతో పాటు హిందీ, కన్నడ వంటి భాషల్లో కూడా 'హను–మాన్' బాగా ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది. గత ఏడాది నుంచి ఇప్పటివరకు ఏ తెలుగు సినిమాకీ రానంత స్పందన ఈ సినిమాకు హిందీలో వస్తోందని చెబుతున్నారు. మా సినిమాకు కాస్త సింపతీ వర్కౌట్ అయ్యిందని అనడం కరెక్ట్ కాదు. ఎందుకంటే మా సినిమా ట్రైలర్, టీజర్ చూసి హిందీ, కన్నడవారు మమ్మల్ని అడిగి సినిమా తీసుకున్నారు. ఏం జరిగినా అంతిమంగా సినిమానే మాట్లాడుతుంది. సినిమానే నిలబడుతుంది. నిర్మాత నిరంజన్‌రెడ్డిగారు, ప్రశాంత్‌వర్మ 'హను–మాన్' సినిమాను బాగా చేశారు.
- 'హను–మాన్' సినిమా సమయంలో నేను ఇతర సినిమాలు ఒప్పుకోకపోవడానికి కారణం ఆ సినిమాల ఇంపాక్ట్ 'హను–మాన్' పై పడకూడదని. ఈ సినిమా సక్సెస్ మా అందరిదీ. ఈ సినిమా యూనిట్ సభ్యులు వారి వారి డిపార్ట్‌మెంట్స్‌లోనే కాక, ఇతర క్రాఫ్ట్స్‌లో కూడా కలుగజేసుకుని బాధ్యతగా చేశారు. ఉదాహరణకు నా లుక్ లోని కొన్ని కాస్ట్యూమ్స్‌కు మా సినిమా ఆర్ట్ డైరెక్టర్ వర్క్ చేశారు. ఈ సినిమా విషయంలో మొదట్నుంచి ఏదో ఆధ్యాత్మిక శక్తి మమ్మల్ని ముందుకు నడిపిందని నా నమ్మకం. 'హను–మాన్' సినిమాను మేం చేయలేదు. 'హను–మాన్' సినిమా మా చేత చేయబడింది. ఈ సినిమాకు లాంగ్ రన్ ఉంటుందని మేం అనుకుంటున్నాం.
- 'హను–మాన్' సినిమాలోని హనుమంతుని విగ్రహం సినిమాకు ఆకర్షణగా నిలిచింది. గ్రాఫిక్స్ అలా చేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. క్లైమాక్స్ చిత్రీకరణకు 60 రోజులకు పైగా సమయం పట్టింది. 'హను–మాన్' ప్రాజెక్ట్ గురించి చిరంజీవిగారికి తెలుసు. ఈ సినిమాలోని హనుమంతుని పాత్ర గురించి ఆయనకు తెలుసు. మా ఇంటెన్షన్ హనుమంతుని పాత్రలో చిరంజీవిగారు అనే. ఆ సంగతి అలా ఉంచితే చిరంజీవిగారు ఇంకా 'హను–మాన్' సినిమా చూడలేదు. అయితే రిలీజైన రోజున శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ పంపారు.

